ఖజానాకుంటకు గండి


ధ్వంసమైన మత్తడి

కోరుట్ల రూరల్: పట్టణ శివారులోని ఖజానాకుంటకు పలువురు రైతులు మత్తడి ప్రాంతంలో గండి కొట్టారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులు గురువారం కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీరాంసాగర్ డి–36 ఉప కాలువ నీటిని నిల్వ చేసి తూముల ద్వారా సాగునీరందించేందుకు ఖజానాకుంట నిర్మించారు. మత్తడికి ఇరువైపులా రెండు తూములు ఏర్పాటు చేశారు. రెండు తుముల ద్వారా విడుదలయ్యే నీరు తిమ్మాయపల్లె, కిషన్‌రావుపల్లె అయిలాపూర్, కల్లూర్ గ్రామాల్లోని పంటలకు అందుతుంది. కాగా అయిలాపూర్‌కు చెందిన వ్యక్తులు వారంక్రితం మత్తడి కింది భాగంలో గండి కొట్టారు. ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి గండికి మరమ్మతు చేశారు. తాజాగా అదే ప్రాంతంలో గురువారం గండి కొట్టేందుకు యత్నించారు. దీంతో రైతులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మళ్లీ ఖజానాకుంటకు గండికొట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసులు రక్షణ కల్పించాలని ఇరిగేషన్ ఏఈఈ ఏ.జయప్రకాష్ వారికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.


ప్రమాదకర గుంత పూడ్చివేత

సాక్షి స్పందన

పెగడపల్లి: మండలంలోని నామాపూర్‌నుంచి పెగడపల్లి వైపు వచ్చే రహదారిపై ఏర్పడిన గుంతను మాజీ సర్పంచ్ ఇనుగండ్ల కరుణాకర్‌రెడ్డి పూడ్చివేయించారు. ప్రమాదకర గుంత పేరుతో గురువారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించి సిమెంట్, కంకరరాళ్లతో గుంతను పూడ్చి చదును చేయించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డికి మండల ప్రజలు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్లుప్తంగా

విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి


విద్యార్థులకు బ్రష్, పేస్ట్‌లు అందిస్తున్న డీఈవో

జగిత్యాల: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ చూపుతారని, ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డీఈవో రాము అన్నారు. గురువారం వరల్డ్ హెల్త్‌డే సందర్భంగా డెంటల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా దంత వైద్య పరీక్షలు చేశారు. డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధి శైలేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీరోజు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు బ్రష్‌లు అందించారు. కార్యక్రమంలో రామకృష్ణరావు, లక్ష్మీనారాయణ, కల్యాణ్, ప్రణీత్, మమతరెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బోయినిపల్లి ఆనందరావు పాల్గొన్నారు.

కవిత కృషితోనే బిల్లులకు ఆమోదం


కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వసంత

రాయికల్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కృషితోనే బీసీ బిల్లులు, ఎస్సీ బిల్లులు ఆమోదం పొందాయని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. గురువారం రాయికల్ మండలం అల్లీపూర్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చిత్రపటానికి వసంత ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్కం మల్లేశ్, సింగిల్ విండో చైర్మన్ రాజలింగం, మహిళ అధ్యక్షురాలు స్పందన, కార్యదర్శి రత్నాకర్‌రావు, ఎస్ఎంసీ మాజీ చైర్‌పర్సన్ వాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


నృత్యం చేస్తున్న చిన్నారులు

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సునావత్ రాజు అన్నారు. మండలంలోని హుస్సేన్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుల్లోనే కాకుండా ఆటపాటల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు, గేమ్ షోలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జంగ గంగాధర్, హెచ్ఎం కస్తూరి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వామివారికి పవళింపు తొట్టెల బహూకరణ


భక్తులు బహూకరించిన తొట్టె

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారికి అద్దాల మండపంలో స్వామివారు పవళించే తొట్లెను గురువారం భక్తులు బహూకరించారు. జగిత్యాల జిల్లా డీఎఫ్‌వో మాదాసు రవిప్రసాద్ దంపతులతో పాటు మరో భక్తుడు విలువైన కర్రతో తయారు చేయించి దేవస్థానం ఈవో శ్రీనివాస్, చైర్మన్ రవీందర్ సమక్షంలో బహూకరించారు. అనంతరం దాతలకు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

చలివేంద్రాలు ఏర్పాటు

మెట్‌పల్లి: పట్టణంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఐదు చోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గురువారం మున్సిపల్ కమిషనర్ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల కోసం మహిళా సమాఖ్య సభ్యులు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటలక్ష్మి, మెప్మా టీఎంసీ సోమిడి శివ, సమాఖ్య సభ్యులు బబ్బూరి లక్ష్మి, చెరుకూరి పద్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం కమిషనర్ మనోహర్‌గౌడ్ ప్రారంభించారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకట్, మెప్మా సీవో శరణ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

• ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: అన్ని వర్గాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం వల్లంపల్లిలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో పాల్గొని మాట్లాడారు. శాసనసభలో బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ,రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం తెలిపి కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏనుగు రమేష్‌రెడ్డి, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుందారపు జలందర్, మాజీ ఎంపీపీ మకిలీ ఇఖ్రాయిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్, చేపూరి నాగరాజు, సాయిని గంగారెడ్డి, అంగడి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

బీసీల బలోపేతమే సర్కారు లక్ష్యం


క్షీరాభిషేకం చేస్తున్న నర్సింగరావు, నాయకులు

ఇబ్రహీంపట్నం: బీసీలను బలోపేతం చేసేందుకే 42 శాతం రిజర్వేషన్ కల్పించారని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ చేసినందుకు గురువారం ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద సంబరాలను నిర్వహించారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర నర్సింహ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లను పంపిణీ చేసి బాణాసంచా పేల్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2 బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం ఏ రాష్ట్రంలో కూడ ఇంతవరకు చేయలేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నేరేళ్ల దేవేందర్, మాజీ ఎంపీటీసీల మండల ఫోరం అధ్యక్షుడు పొనకంటి వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

మల్లాపూర్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అందించి లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని గుండంపల్లిలో ఆయన పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు పశువైద్య శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పిచ్చుకలకు నీటి వసతి కల్పించాలి


పిచ్చుకలకు ధాన్యం అందిస్తున్న కరస్పాండెంట్

జగిత్యాల: వేసవి కాలంలో పిచ్చుకలకు ప్రతీ ఒక్కరు తాగు నీటి వసతి కల్పించాలని నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నరేశ్ అన్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా బయోసైన్స్‌పై అవగాహన కల్పించారు. జీవ వైవిధ్యం కాపాడటంలో పంటలు, పండ్లతోటల అభివృద్ధిలో పిచ్చుకలు పోషించే పాత్రపై ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని గురువారం మండలంలోని కోమటికొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గడ్డం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పెరిగిన రేడియేషన్‌తో పిచ్చుకల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని అన్నారు. విద్యార్థులు తయారు చేసిన పక్షుల గూళ్లను ప్రదర్శించగా అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధారాణి, విశాల్, నర్మద, రాణి, జోత్స్న, విద్యార్థులు పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికలతో అందరికీ మేలు

కథలాపూర్: దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల అందరికీ మేలు జరుగుతుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య అన్నారు. గురువారం కథలాపూర్‌లో బీజేపీ కార్యాలయంలో 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' అనే అంశంపై బీజేపీ నాయకులతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఆర్థికభారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: బీజేపీ మండల స్థాయి సమీక్ష సమావేశం గురువారం మేడిపల్లిలో నిర్వహించారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ కార్యక్రమం పై ప్రతి గ్రామం లో ప్రజలకు అవగాహన కల్పించాలని మండల అధ్యక్షుడు ముంజ శ్రీనివాస్ కార్యకర్తలని కోరారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ కార్యక్రమానికి కన్వీనర్ గా కొప్పెర లింగారెడ్డి, కో కన్వీనర్ గా బత్తుల రమేష్, శివ లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ క్యాతం దశరథ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో మూడు దశల్లో పూత

జగిత్యాలఅగ్రికల్చర్: వాతావరణంలో మార్పులతో మామిడిలో మూడు దశలో పూత వచ్చినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్యాంప్రసాద్ తెలిపారు. జిల్లాలోని మేడిపల్లి, జగిత్యాలరూరల్ మండలాల్లో మామిడి తోటలను పరిశీలించారు. మొదటి దశలో పూత చాలామటుకు పిందెగా మారిందని, రెండోదశలో అధిక ఉష్ణోగ్రతలతో పిందెలు రాలిపోతున్నాయని తెలిపారు. ఈ సమయంలో గోలి సైజ్‌గల పిందెలు ఉన్న తోటల్లో రసాయన ఎరువులను డ్రిప్‌లో కరిగించి, నేరుగా చెట్లకు అందించాలని సూచించారు. నీటి తడులు ఎక్కువగా ఇవ్వాలన్నారు. ఆయన వెంట హెచ్ఈఓ అన్వేష్ ఉన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు


ఇబ్రహీంపట్నంలో ఇంటర్ విద్యార్థినులు

జగిత్యాల: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు 5984 మంది విద్యార్థులకు గాను 5848 మంది విద్యార్థులు హాజరు కాగా, 136 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఇబ్రహీంపట్నం: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు గురువారం ముగిశాయి. విద్యార్థులు చివరిరోజు పరీక్షలు ముగిసిన తర్వాత ఆనందాలను వ్యక్తం చేస్తూ బెస్ట్ ఆఫ్ లక్ చెప్పుకుని ఇంటి దారి పట్టారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

కోరుట్ల: పట్టణంలో స్వచ్ఛ–సర్వేక్షన్ 2024–25 కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తడి పొడి చెత్త, హానికరమైన చెత్త ,120 మైక్రాన్‌ల కన్న తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వాడొద్దని సూచించారు. తడి,పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనానికి ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై సంబరాలు


సంబరాల్లో అంబేడ్కర్ సంఘం నాయకులు

కథలాపూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంపై మండల కేంద్రంలో అంబేడ్కర్ మాదిగ సంఘం ఆధ్వర్యంలో గురువారం సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాశవత్తుల లక్ష్మిరాజం, మిట్టపెల్లి కిషన్, శనిగారపు గణేశ్, నల్ల గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులతో గ్రామాల్లో మార్పు

మల్లాపూర్: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, కోట్లాది రూపాయలతో గ్రామాల్లో అభివృద్ధి పనులతో గ్రామాల్లో గొప్ప మార్పుకు నాంది పలికిందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. మల్లాపూర్‌లో ఎస్ఆర్ ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం, నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఆనంద దినోత్సవం

జగిత్యాలటౌన్: తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ ఆనంద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరిఅశోక్‌కుమార్ మాట్లాడుతూ మనిషి జీవిత పరమార్థం ఆనందంగా జీవించడమేనన్నారు. సకార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,హన్మంత రెడ్డి, వెల్ముల ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

సరస్వతీ దేవికి పూజలు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చెట్లపల్లి బాలక్రిష్ణయ్య నర్సమ్మల జ్ఞాపకార్థం 13 ఏళ్ల క్రితం చెట్లపల్లి నరేందర్‌గౌడ్ ఏర్పాటు చేసిన విగ్రహ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ కనక దుర్గా సేవా మండలి ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి–కనక సోమేశ్వర స్వామి కల్యాణంను ఘనంగా నిర్వహించారు. సంగ గంగరాజం–లావణ్య దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మహిళలు సాముహిక కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ క్యాతం లక్ష్మారెడ్డి, శ్రీ కనక దుర్గాసేవా మండలి కమిటీసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై బీఆర్ఎస్ నాయకుల ధర్నా


సారంగాపూర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

సారంగాపూర్: కాంగ్రెస్ పార్టీ పాలనలో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. రైతుల సమస్యలపై సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు గురువారం రోడ్డుపై బైఠాయించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుభరోసా ఇవ్వలేదని, పంటకు ఇప్పటికి మూడెకరాలు వరకు మాత్రమే భరోసా అందించిందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షులు తేలు రాజు, నేరెల్ల సుమన్‌గౌడ్, సింగిల్ విండో మాజీచైర్మన్లు సాగి సత్యంరావు, మెరుగు రాజేశం, నాయకులు కత్తెరపాక జలందర్, గంగారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'మోసపూరిత హామీలతో రైతులను ముంచారు'

మల్లాపూర్: రైతు సంక్షేమాన్ని విస్మరించి మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసే ప్రజలు వరుసగా బీఆర్ఎస్ ఆశీర్వదిస్తున్నారన్న విషయాన్ని మరిచిపోవద్దని హితవు పలికారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ప్యాక్స్ చైర్మన్ వేంపేట నర్సారెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజన, శరత్‌గౌడ్, కోమ్ముల జీవన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

వెల్గటూర్ : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం సీఎమ్మారెఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు వెల్గటూర్, ఎండపల్లి మండలాలకు చెందిన 103 మంది లబ్ధిదారులకు చెక్కులు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనుమాల మంజుల, నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

పెగడపల్లి: మండల కేంద్రానికి చెందిన కొత్తూరి రాజయ్య (53) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు. కొంత కాలంగా కుటుంబంతో కలిసి రాజయ్య కరీంనగర్‌లో ఉంటున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పెగడపల్లికి వచ్చిన రాజయ్య తన ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో తలపై గొడ్డలితో దాడి చేసుకుని, దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాగృతి సమాఖ్య మండల అధ్యక్షురాలిగా సమత

సారంగాపూర్: మండల జాగృతి సమాఖ్య (సెర్ప్) అధ్యక్షురాలిగా మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బొమ్మిడి సమత ఎన్నికయ్యారు. కార్యదర్శిగా మామిడి మంగ, కోశాధికారిగా రేచపల్లి గ్రామానికి చెందిన తంగేలా ప్రవళిక ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డీపీఎంలు మానిక్‌రెడ్డి, వనజ, వెంకటేష్, ఏపీఎం రాజయ్య, సీసీలు,సభ్యులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘ అధ్యక్షుడిగా మురళి


మురళి

మెట్‌పల్లి: విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం పట్టణ అధ్యక్షుడిగా కొండ మురళి, కార్యదర్శిగా ఇంద్రాల ఈశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గజేంద్రభీష్మ, మ్యాడపు అశోక్, కొడిమ్యాల వెంకటస్వామి ప్రకటించారు.

ప్లే క్లాస్ రూం ప్రారంభం


ప్లే క్లాస్ రూంలో ఆడుకుంటున్న విద్యార్థులు

వెల్గటూర్ : మండలంలోని గుల్లకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్లే క్లాస్ రూంను గురువారం హెచ్ఎం చందూరి రాజిరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠశాల గ్రాంటు నుండి విద్యార్థుల సౌకర్యార్థం 32 కుర్చీలు, బోధనోపకరణాలు, జంతు నమూనాలు, పక్షులు, క్రీడా సామగ్రి, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.